# వెతకబోయిన తీగ

ప్రొద్దున సుమారు తొమ్మిది గంట లవుతూ వుంటుంది. ఆనందరావు అప్పుడే కాఫీ త్రాగి ఈజీచైరులో కూర్చొని సిగరెట్టు వెలిగించి ఆలోచనా పూర్వకంగా వుండిపోయాడు. మధ్య మధ్య ధూమపానం చేస్తున్నాడు. కాని అతని వూహా కేదో అందటం లేదు. చిరాకు పడుతున్నాడు. అలాంటి సమయంలో తలుపుమీద కొట్టిన చప్పుడు వినిపించింది. నెమ్మదిగా లేచాడు. లావుపాటి మనిషి, ఏనుగంత బొజ్జ కదూ! ఆయాసంతో తలుపు తీశాడు.

"నమస్కారమండి" అన్నాడు బయట వ్యక్తి.

"హల్లో! నువ్వురా నీలకంఠం" అంటూ ఆప్యాయంగా లోపలకు ఆహ్వానించాడు.

నీలకంఠం, ఆనందరావు బాల్య స్నేహితులు. ఒక వూరిలో పుట్టి పెరిగిన వాళ్ళు. కాలక్రమాన్ని బట్టి ఒకరి నొకరు విడిపోవలసి వచ్చింది. ఆనందరావు కొంతవరకూ చదివి వూరుకొని తన తెలివి తేటల వలన పేరు సంపాదించుకున్నాడు. నీలకంఠం మాత్రం నెల్లూరు బడిలోనే చదువు చాలించి వ్యాపారా లంటూ దేశాటన ప్రారంభించాడు. వా రిద్దరూ కలుసుకొని చాలా సంవత్సరా లైంది. అలాంటి బాల్య స్నేహితుణ్ణి చూడగానే ఆనందరావుకు ఎక్కడలేని సంతోషం పుట్టుకొచ్చింది. నీలకంఠాన్ని గదిలో కూర్చోబెట్టి ఒకసారి ఇంట్లోకి పోయి తిరిగి వచ్చాడు. కుర్చీలో కూర్చుంటూ,

"ఏం? నీలకంఠం. మనం కలుసుకుని చాలా సంవత్సరా లయింది కదూ! నువ్వేదో వ్యాపారం చేస్తున్నావని విన్నాను. కాని, నిన్ను కలుసుకోవడానికి అవకాశం దొరకలేదు. అయితే, నీ వ్యాపారం ఎలా సాగుతోంది" అని కుశలపూర్వకంగా ప్రశ్నించాడు.

"ఆ! ఒక్క వ్యాపార మేమిటిలెండి. రోజు కొకటి. ఏది లాభమని తోస్తే దాన్ని ప్రారంభించాను. అంచేత చాలా నష్టపడిపోయాను. ఇలాంటి సమయంలో మిమ్మల్ని ఒకసారి కలుసుకోవాలని ప్రయత్నించాను. తెల్లవారి లేస్తే ఎక్కడో ఒక చోట పని వుంటుంది. దానికోసం తిరగాల్సివస్తోంది. అస లింతకూ ఒక విషయంలో మీ సహాయం కోసం వచ్చా ననుకుంటే క్షణికమైనా తీరుబడి లేదనుకోండి. ఒక రోజు బొంబాయి, మరో రోజు ఢిల్లీ, మద్రాసు, కలకత్తా ఒకటేమిటి అన్నీ తిరగవలసి వస్తోంది. కాని, ఈనాడు మిమ్మల్ని ఏ విధంగా నైనాసరే కలుసుకోవా లనుకున్నాను. కలుసుకున్నాను అంతే" అన్నాడు నీలకంఠం.

"అలాగా. నావల్ల జరిగే పనేమిటి నీలకంఠం? నా వ్యాపారం నీకు తెలుసుగా. అయినా. నాతో అంత పని కావలసి వచ్చిందా? అద్భుతం. అయితే, చెప్పు వింటాను. నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అంటూ హామీ ఇచ్చాడు ఆనందరావు.

"ఇదేమంత పెద్ద విషయం కాదు. సంవత్సరం క్రిందట గుంటూరులో ఒక డ్రామా కాంట్రాక్టు తీసుకొని వేయించాను. ఆ రోజున డబ్బు బాగా వచ్చింది. వచ్చిన వెయ్యి రూపాయలు ఒక పెట్టెలో భద్రంగా పెట్టి పడుకున్నాను. ఆ గదిలోకి పొరబడి ఆ రాత్రి కా రాత్రే డబ్బంతా దొంగిలించేశారు. తెల్లవారిన తర్వాత లేచి చూస్తే డబ్బు కనుపించదు. డ్రామా ట్రూపువా ళ్ళందరినీ అడిగాను. వాళ్ళు మా కేం తెలియ దన్నారు. వెంటనే పోలీసులకు రిపోర్టు చేశాను. పోలీసు ఇన్‌స్పెక్టరు అందరినీ పరీక్షించగా అందులో ఆడవాళ్ళ వేషాలు వేసే పదునాలుగేళ్ల కుర్రాడు కనుపించలేదని తేలిపోయింది. అయితే, వాడే దొంగిలించి పారిపోయాడని నిర్ధారణకు వచ్చాం. వాణ్ణి కూడా నాకు బాగా తెలుసు. ఒకసారి నా దగ్గరకు వచ్చి ఏదైనా పని ఇప్పించమని ఏడ్చాడు. వాణ్ణి తీసుకు వెళ్ళి ఆ నాటక కంపెనీలో నేనే చేర్పించాను. ఆడ వేషం వేస్తే వాణ్ణి బ్రహ్మదేవుడు కూడా కనిపెట్టలే డనుకోండి. కాని ఏం చేస్తాం. కనికరిస్తే నా కంట్లోనే కారం కొట్టాడు. పోలీసు వాళ్ళూ ప్రయత్నిస్తున్నారు. నేనూ వీలున్నప్పు డల్లా ప్రతి నాటక కంపెనీ తిరిగి చూచాను. కాని, నా డంతు దొరకటం లేదు. వచ్చిన వెయ్యి

"మరామ"



రూపాయలు వాడి పరమయ్యాయి" అన్నాడు నిట్టూర్పు విడుస్తూ నీలకంఠం.

"నా దంత ఘటికుడేం?" అన్నాడు ఆనందరావు వుషారుగా మళ్లీ సిగరెట్టు వెలిగిస్తూ.

"అవునండి ఆనందరావుగారు. ఏ వ్యాపారం చేసినా నా కిలాగే నష్టం వస్తోం" దన్నాడు విచారంగా నీలకంఠం.

"నువ్వేం భయపడకు నీలకంఠం. వాడి సంగతి నేను కనుక్కుంటానుగా. వాడి పూర్తి పేరు, బంధువుల పేర్లు అన్నీ సవిస్తరంగా చెప్పు' రెండు నెలల్లోనే వాణ్ణి పట్టి నీకు ఒప్పగిస్తా". అన్నాడు ఆనందరావు గర్వంగా.

నీలకంఠం అన్ని వివరాలూ ఆనందరావుకు అందించాడు.

డైరీలో వ్రాసుకొని

"నీలకంఠం నీ కేం ఫర్వాలేదు. నిశ్చింతగా వుండు. నీ పనులు నువ్వు చూసుకో. వాణ్ణి తీసుకు వచ్చి నీకు ఒప్పగించే బాధ్యత నాది" అన్నాడు ఠీవిగా ఆనందరావు.

"అంతే చాలు ఆనందరావుగారు. మీ మాటే నాకు ధైర్యం. మీరు నిజంగా శక్తివంతులని, నేర్పరులని నాకు తెలుసు. మనసులో వుంచుకోండి. మరి నేను శలవు తీసుకుంటాను" అంటూ లేవబోయాడు నీలకంఠం.

"అరెరే! అప్పుడే వెళ్లడమా. ఎన్ని సంవత్సరాలకు కలుసుకున్నాం. ఇలా వెళ్లిపోతే నా కెంత కష్టంగా వుంటుంది ... ఒక్క నిముషం ఆగు ... అమ్మాయి శారదా, ఫలహారం, కాఫీ తీసుకురా తల్లీ" అని కేక వేశాడు.

"అలాగే తీసుకు వస్తున్నానండి బాబాయి గారు" అని లోపల్నుంచి జవాబు వచ్చింది. నీలకంఠం తల వంచుకొని కూర్చుండిపోయాడు. ఆనందరావు ఆలోచనలో మునిగిపోయాడు.

టేబులు మీద ప్లేట్లు చప్పుడుతో కాని ఇద్దరూ తలలు పైకెత్తలేదు. నీలకంఠం తల పైకెత్తి శారద వంక చూచాడు. శారద సిగ్గుతో లోపలకు పారిపోయింది. టిఫిను తింటూ ఆమె వెళ్లిన దిక్కుకే చూస్తూ ఆలోచనాపూర్వకంగా వుండిపోయాడు నీలకంఠం. ఆనందరావు గమనించి—

"ఏమిటి నీలకంఠం అలా వుండిపోయావు. కొంచెం ఫలహారం తీసుకో. ఆ అమ్మాయి ఎవరో కాదు. మా కూతురేలే" అన్నాడు నవ్వుతూ.

నీలకంఠం ఆనందరావుకేసి తిరిగి "అలాగా మీ కెంతమంది పిల్లలండీ" అని ప్రశ్నించాడు.

ఆనందరావు నవ్వి "ఎంతోమంది కూడాను! మాకు పిల్లలు లేరని పూజలూ పునస్కారాలు చేసి కోటప్పకొండకు పోతే, ఆ దేవుడే కరుణించి మా ఆవిడకు ఈ పిల్లను కానుకగా ఇచ్చాడు. అప్పటికంటే కూతురుకన్నా ఎక్కువగా చూచుకొంటున్నాం. ఏదైనా కాని దేవు డిచ్చిన బిడ్డ కదూ! స్వంత కూతురు కంటే ఎక్కువ మనకో నీలకంఠం. శారద నిదానం, ఆ మాటల వరుస చూస్తుంటే మామీద నిజంగా దేవుడికి దయ కలిగిందని మా ఆవిడ ఎప్పుడూ అంటుంటుంది" అని ఇంకా ఆనందరావు చెప్పుకు పోతూంటే నీలకంఠం అందుకొని "కొంచెం ఆగండి. అమ్మాయి పేరు శారద కదూ, ఒక్కసారి పిలిపిస్తారా?" అన్నాడు.

"ఏం. అలా అంటున్నావు?"

"అబ్బే! ఏమీ లేదండి. దేవుడిచ్చిన బిడ్డ కదూ! నాకూ మరొకసారి చూడాలని వుంది."

"సరి సరే, నీకూ భగవద్భక్తి మెండుగా వుందన్న మాట" అని ఇద్దరూ ఒక్కసారే నవ్వుకున్నారు.

"అమ్మాయి శారదా ఇలా రా అమ్మా" అని పిలిచాడు ఆనందరావు.

శారద వచ్చి సిగ్గుతో వాళ్ల దగ్గరకూ ఎదురుగా నిలబడింది. నీలకంఠం తదేక ధ్యానంతో చూడటం మొదలుపెట్టాడు. శారద సిగ్గుతో తల వంచుకొని నిలబడి పోయింది. అతని తీరు చూస్తుంటే ఆనందరావుకు కొంచెం కష్టం తోచింది.

"ఏం సంగతి నీలకంఠం" అన్నాడు ఆనందరావు.

"అబ్బే ఏమీ లేదండీ". అంటూ నీలకంఠం లేచి శారద దగ్గరకు వచ్చి ఆమె ఎడమ చెవి పట్టుకున్నాడు. శారద భయంతో తల పైకెత్తి నీలకంఠం

[మిగత 57 వ పేజీలో]



అది తల వెంట్రుకలను పెంచును. రాలిపోకుండ నిలుపును. నూతన శోభ చేకూర్చును.

తయారుచేసినవారు: కేశవర్ధిని ప్రొడక్ట్సు, క్రాస్ కట్ రోడ్డు, కోయంబత్తూరు.



అడయార్ ఆర్ట్స్ అకాడమీ మూడవ వార్షికోత్సవ సందర్భంలో గానం ప్రదర్శించిన సంగీత కళాభూషణి శ్రీమతి యస్. లలిత

## శారదావారి "జయభేరి"

శారదా ఫిలింస్ వారు తెలుగు, తమిళ భాషలలో నిర్మిస్తున్న "జయభేరి" చిత్రం తాలూకు తొమ్మిది భాగాలు పూర్తయినట్లు తెలుస్తోంది. ఎ. నాగేశ్వరరావు, అంజలీదేవి, రాజసులోచన, శాంతకుమారి, వాగ్గయ్య, రేలంగి, రమణారెడ్డి, గుమ్మడి మున్నగు వారు తెలుగు చిత్రంలోను, ఎ. నాగేశ్వరరావు, అంజలీదేవి, రాజసులోచన, శాంతకుమారి, వాగయ్య, తంగవేలు, సారంగపాణి, సహస్రనామం, ముత్తులక్ష్మి తమిళ చిత్రంలోను నటిస్తున్నారు. శ్రీ పి. పుల్లయ్య దర్శకత్వం, శ్రీ పెండ్యాల సంగీతం నిర్వహిస్తున్నారు.

## "సామ్రాట్ విక్రమార్క" విడుదల

ప్రభాత్ స్టూడియోస్ వారి "సామ్రాట్ విక్రమార్క" (అను భట్టి విక్రమార్కుని కథ) 8 వ తేదీని విడుదలైంది. డాక్టర్ గోవిందరాజుల, శివరావు, రంగరాజు, కమలాకోట్నీస్, సూర్యకాంతం మున్నగు వారు నటించిన ఈ చిత్రానికి మాటలు పాటలు శ్రీ తాపీ ధర్మారావు నాయుడు వ్రాశారు.

## "శ్రీ కృష్ణగారడి" విడుదల

నందీ పిక్చర్స్ వారి "శ్రీ కృష్ణ గారడి" తెలుగు చిత్రం 22 వ తేదీని విడుదల కాబోతోంది. శ్రీ వై. వి. రావు దర్శకత్వం, శ్రీ పెండ్యాల సంగీతం నిర్వహించిన ఈ చిత్రంలో జగ్గయ్య, అమరనాద్, సూర్యకళ, శివరావు, ఎ. వి. సుబ్బారావు మున్నగు వారు పాల్గొన్నారు.

## ఒ. పి. నయ్యర్ ఉత్తరాది పర్యటన

సంగీత దర్శకుడు ఒ. పి. నయ్యర్ 15 రోజుల పాటు విశ్రాంతి తీసుకునే సందర్భంలో ఢిల్లీ, ఆ ప్రాంతాల పల్లెలు తిరిగి వస్తారట — అక్కడ జానపద సంగీతం కూడా కొంత పట్టుకుందామని ఆయన ఉద్దేశం.

## బి. సి. ఫిలింస్ "మాకాలాల్"

బి. సి. ఫిలింస్ వారు "మాకాలాల్" అనే చిత్రం నిర్మిస్తున్నారు. కామినీకౌశల్, రాజేంద్ర కుమార్, శశికళ, డెయిసీ ఇరానీ, నజీర్ హుసేన్, రాధాకిషన్‌లు నటించే ఈ చిత్రానికి కేదార్‌కపూర్ దర్శకత్వం, మదన్‌మోహన్ సంగీతం నిర్వహిస్తున్నారు.

# వెతకబోయిన తీగె

[7 వ పేజీ తరువాయి]

ముఖంలోకి చూచి హడలిపోయింది. ఈ దృశ్యాన్ని చూచి ఆనందరావు కోపంతో లేవబోయాడు. శారద కాళ్ళు గజగజ వణికిపోతున్నాయి. నీలకంఠం పిచ్చెత్తిన వాడిలా పకపకా నవ్వి "ప్రఖ్యాత డిటెక్టివ్ ఆనందరావుగారే మోసపోయారు" అన్నాడు.

ఆనందరావు దిగ్భ్రాంతి చెందాడు. "చూచారా? ఆనందరావుగారు మా నరిసిగాడి తడాఖా డిటెక్టివ్ ఆనందరావు గార్నే బోల్తా కొట్టించాడు" అంటూ శారదను ముందుకు లాగబోయాడు. శారద పట్టు తప్పించుకొని పారిపోబోయింది. మళ్ళీ నీలకంఠం గట్టిగా పట్టుకున్నాడు.

"నీ ధోరణి నా కేం బాగుండలే" దన్నాడు ఆనందరావు కోపంతో.

"అవునండీ ఆనందరావుగారు. ఈ చెవి క్రింద పుట్టు మచ్చే డ్రామా యాక్టరు నరిసిగాడని తెలుపుతోంది. చెప్పరా! సరిగా సమాధానం చెప్పు ఆనందరావుగారికి" అని నాలుగు దెబ్బలు గబగబా వీపుమీద అంటించాడు.

"అమ్మో బాబో చచ్చిపోయాను నిజం చెబుతా" నని భయపడుతూ శారద వేషంలో వున్న నరిసిగాడు అసలు విషయా లన్నీ సవిస్తారంగా చెప్పేశాడు.

"సరే పదరా నరిసిగా! ఆనందరావుగారూ! నేను వచ్చిన పని అయిపోయింది. ధన్యవాదాలు" అంటూ నరిసిగాణ్ణి తీసుకొని పోలీసు స్టేషను వైపునకు నడిచాడు నీలకంఠం. ఆనందరావుకు నోటమాట లేదు. అలాగే ఆశ్చర్యంతో ఆలోచిస్తూ కుర్చీలో కూలబడిపోయాడు.

పరదా చాటునుండి అన్ని సంగతులు వింటున్న ఆనందరావు భార్య లలితమ్మ భర్త ఎదుటకు వచ్చి—

"హరి వెధవ. ఎంత పని చేశాడండి. నేనూ మోసపోయాను. సిగ్గులేక వాడితో రోజూ ఒళ్ళూ కాళ్ళూ పట్టించుకునే దాన్ని" అంది.

ఆనందరావు భార్య ముహంకేసి ఒకసారి చూచి హాలంతా ప్రతిధ్వనించేలాగున పకపకా నవ్వేశాడు.

# వాపస్ (9 వ పేజీ తరువాయి)

వెళ్ళగలవా? వీడిని ఎక్కడికి పంపడానికి నా మనస్సు ఒప్పడం లేదు. ఈ భయంకరమైన తుఫానుల మృత్యు దేవత బారినుండి తప్పించుకొని బ్రతకగలడా అన్నదే నా సందేహం" అని ఇక చెప్పలేకపోయింది. నేను నా ఓవర్‌కోటు తీసి ఆమె కిస్తూ "నీ తడి గుడ్డలు తీసివేసి దీనిని కప్పుకో" అన్నాను.

ఆమె అలాగే నిలబడిపోయి వణుకుతున్న స్వరంతో "మిస్టర్ సేత్, నా చేతి వ్రేళ్లకు కోటు గుండీలు తీసే శక్తి గూడ లేదు" అంది.

నే నామె కోటు గుండీలు తీసి ఆమె బట్ట లన్నీ తీసివేశాను. నే నామె తడసిన బట్టలను తీసివేస్తూ "అన్నపూర్ణా, సిగ్గుపడవలసిన దాదేమీ లేదు. ఇంకా చీకటిగానే వుంది" అన్నాను.

"సిగ్గు! జర్మనీ పోలెండు సిగ్గును ఎప్పుడో అపహరించింది. పోలిష్ రక్తంతో ఏమాత్రం వేడి మిగిలివున్నా పోలెండ్ దీనికి ప్రతీకారం తప్పకుండా జరిపి తీరుతుంది. కాని అబ్బ!" అంటూ ఆమె పిల్లవానిని రెండో చంకకు తీసుకుంది.

ఇప్పుడు తెల్లవారింది. మా వెనుకగా మంచు నది ప్రవహిస్తోంది. సూర్యుని కిరణాలు ఆమె నగ్న శరీరపు నీడను ఇంకా విశాలం చేసి నదిలోకి నెట్టాయి. ఆ నగ్న స్త్రీ అలాగే రాతి విగ్రహం వలె నిలబడి ఉంది. అప్పు డామె చేతుల్లో ఓవర్ కోటు ధరించే శక్తి గూడ లేదు. నే నామెకు ఓవర్ కోటు తొడిగి పసిబిడ్డను వేడి గుడ్డల్లో చుట్టాను. నే నామెను కారు ఎక్కించుదామని విశ్వ ప్రయత్నం చేశాను. ఆమె అంగీకరించలేదు.

"మిస్టర్ సేత్, మీరు వెళ్లండి. నా కష్టాలను పోలెండ్ ప్రజల కష్టాలకు దూరంగా వేరు చేయలేను. నేను పోలెండ్ గడ్డమీద జన్మించాను. ఈ విపత్తు సమయంలో పోలెండ్‌ను విడిచిపెట్టను. ఈ లక్షలాది పోలెండ్ ప్రజలు అనుభవించే కష్టసుఖాలనే నేను గూడ అనుభవిస్తాను. ఈ బిడ్డను మాత్రం మీరు తీసుకు వెళ్లండి" అంటూ బిడ్డను మా కిచ్చింది. మేము ఆమెకు కొన్ని అమెరికన్ నాణాలు మరి కొన్ని పోలిష్ నాణాలు ఇచ్చాము. తినడానికి ఆహార పదార్థాలు, కప్పుకోవడానికి గుడ్డలు ఇచ్చి మేము బయలుదేరాం.

చంద్రకళ నిశ్శబ్దంగా కూర్చుని వింటూవుంది. అంతా చెప్పిన తరువాత సేత్ కృష్ణగోపాల్ "మానవునికి పిచ్చి పడితే సోదర మానవులను నరకడానికి, చంపడానికి తయారవుతాడు. దేశానికి పిచ్చిపడితే మరో దేశంమీదకు ఇదే విధంగా దూకుతుంది. దానినే మనం యుద్ధం, పోరాటం అంటాము. ఇది నిజంగా ఆయా దేశాల వెర్రితనం" అన్నాడు.

భర్త చెబుతున్న మాటలు సరిగా వినకుండానే "ఆ పసిబిడ్డ ఎక్కడున్నాడని" అడిగిం దామె.

నేను పసిబిడ్డ మంచి చెడ్డలు చూడలేనని నీకు మాత్రం తెలియదూ! అందుకనే ఒక దాసీ మనిషికి అప్పగించి వచ్చాను. ఆమె ఇవ్వాళో రేపో ఆ బిడ్డను తీసుకొని మరో విమానంలో వస్తుంది.